

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



## కర్నూలు | నంద్యాల

మంగళవారం | 31 డిసెంబరు 2024 | పేజీలు 8


### శ్రీశైలంలో ఆది దంపతులకు
# వైభవంగా వెండి రథోత్సవం



వెండి రథంపై కొలువుతీరిన స్వామి అమ్మవార్లు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆశీనులను చేసి,అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు,అర్చక స్వాములు పాల్గొన్నారు.

**మల్లన్న దర్శనానికి 4 గంటల సమయం :** నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన మిగతా 2లో

### బియ్యం వ్యాపారుల మధ్య విభేదాలు..
# బయటపడుతున్న అక్రమాలు




- పరస్పర ఫిర్యాదులు..ఫలితంగా గోదాముల పై అధికారుల దాడులు
- అడకత్తెరలో పౌర సరఫరాల శాఖ అధికారులు
- బేతంచెర్ల వ్యాపారుల పై బిగుస్తున్న ఉచ్చు
- ఈ వ్యాపారాలతో తనకు సంబంధం లేదంటున్న మాజీ మంత్రి బుగ్గన



నెరవాటి వెంకట సుబ్బయ్య ,
కర్నూలు మేజర్‌న్యూస్ బ్యూరో :

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పౌర సరఫరాల బియ్యం గోదాములు నిర్వహిస్తున్న వ్యాపారుల మధ్య విబేధాలు తారా స్థాయికి చేరుకున్నాయి. ఇరు వర్గాలు పరస్పరం అధికారులకు ఫిర్యాదులు చేసుకుంటున్నాయి. ఫలితంగా పౌరసరఫరాల గోదాముల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది బహిరంగమైంది. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ ఇరు వైపులా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. బియ్యం గోదాముల్లో జరుగుతున్న అ్రకమాలు వెలుగులోకి వస్తుండడంతొ సంబంధిత అధికారులు సైతం అడకత్తెరలో పోక చెక్క తరహాలో నలిగిపోవలసిన పరిస్థితి తలెత్తింది. వారు ఎపుడేం జరుగుతుందోనన్న అందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు.ఇరు వ్యాపార వర్గాల మధ్య నెలకొన్న విబేధాల కారణంగా ఒక వర్గం చేసిన ఫిర్యాదుతో నెల రోజుల క్రితం ఆదోని, కర్నూలు, నంద్యాలలోని ప్రత్యర్థి వర్గానికి చెందిన గోదాముల్లో తనిఖీలు జరిగాయి. అక్కడ నిల్వలు సక్రమంగా ఉన్న కారణంగానో, రాజకీయ ఒత్తిళ్ల కారణంగానో కానీ ఆ దాడుల వ్యవహారం వెలుగులోకి రాలేదు. తమ గోదాములపై అధికారుల దాడులకు మరో వ్యాపార వర్గమే కారణమన్న కసితో రెండో వ్యాపార వర్గం బేతంచెర్ల గోదాములపై ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్కడ కూడా దాడులు చేశారు. ఇక్కడ ఒక గోదాములో ఉండాల్సిన బియ్యం బస్తాల కన్నా 398 తక్కువగా ఉండ డాన్ని గుర్తించారు. మరో గోదాము తనిఖీకి వ్యాపారులు సహకరించకపోవడంతో అధికారులు రెండు గోదాములను సీజ్ చేశారు. ఈ దాడుల్లో పౌర సరఫరాల శాఖ డైరక్టరు మహేష్ నాయుడు స్వయంగా పాల్గొనడంతో బేతంచెర్ల గోదాము వ్యవహారం బహిరంగమైంది.. కాగా ఒక వర్గం గోదాములపై దాడులు జరిగిన అనంతరం బేతంచెర్ల గోదాముల నిర్వాహకులు తమ గోదాములపై దాడులు తప్పవని భావించారు.ఈ గోదాముల నిర్వహణకు సంబంధించిన వ్యాపారుల్లో వైసిపికి చెందిన కీలక నేత ఉండడం వారి భయానికి కారణంగా భావిస్తున్నారు.. ఈ నేపథ్యంలో బియ్యం వ్యాపారంలో భాగస్వామిగా ఉన్న వైసీపీ నేతతో సంబంధం లేకుండా మిగిలిన భాగస్వాములు కొత్త గోదాముల వేటలో పడ్డారు.కర్నూలు నగరం చుట్టుపక్కల ఉన్న గోదాములను లీజుకు తీసుకోవాలని సదరు గోదాముల యజమానులతో సంప్రదింపులు జరిపారు. వీటిలో ఒక యజమానితో ఒప్పందం కుదరడంతో మిగతా 2లో

### సంతృప్తి చెందే స్థాయిలో
# ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

➲ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాముఖ్యతనిచ్చి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మిగతా 2లో

### వినతులను ఎప్పటికప్పుడు
# పరిష్కరించాలి

● కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా,జేసి నవ్య

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూడాలని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై మిగతా 2లో

సూర్య



# బియ్యం వ్యాపారుల మధ్య విభేదాలు..బయటపడుతున్న అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆ గోదాముల్లో బియ్యం నిల్వలు చేసుకునేందుకు అనుమతులు కోరుతూ బేతంచెర్ల వ్యాపారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ అధికారుల అనుమతుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సదరు గోదాముల యజమానులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో దాడుల భయం ఉండదని బేతంచెర్ల వ్యాపారులు అంచనా వేసినట్లు తెలుస్తోంది. ఇది గుర్తించిన ప్రత్యర్థి వర్గం వ్యాపారులు సదరు గోదాములలో బియ్యం నిల్వకు అనుమతులు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో అనుమతుల విషయంలో జరుగుతున్న జాప్యంపై గోదాముల యజమానులతో రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడించారు. దీంతో బియ్యం నిల్వలకు సంబంధించిన అనుమతుల ఫైలు వేగం పుంజుకొని నేడో, రేపో ఢిల్లీ అధికారుల అనుమతుల కోసం పంపుతారని తెలుసుకున్న కర్నూలు వ్యాపారులు బేతంచెర్ల గోదాములపై దాడులకు పథక రచన చేసి సఫలీకృతులయ్యారని చర్చించుకుంటున్నారు. బేతంచెర్ల గోదాములపై జరిగిన దాడుల్లో బియ్యం నిల్వలు తగ్గడం, రెండవ గోదామును తెరిచేందుకు వ్యాపారుల నుంచి అధికారులకు తగిన సహకారం లభించకపోవడంతో మూడు రోజులుగా గోదాము తలుపులను అధికారులు తెరవలేకపోయారు. మరొకటి, రెండు రోజులు చూసి పంచనామా నిర్వహించిన అనంతరం గోదాముల్లో ఉన్న నిల్వలను లెక్కగడతామని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

**బస్తాలు తగ్గడం నిబంధనల ప్రకారం నేరం కాదా? :** కాగా బేతంచెర్ల గోదాముల్లోని ఒక దాంట్లో 398 బస్తాల బియ్యం తగ్గడం పెద్ద నేరమేమీ కాదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. నిబంధనల ప్రకారం తరుగుదలను లెక్కిస్తే ఆ బస్తాల లెక్క తేలుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండవ గోదామును అధికారులు తెరవడానికి ఎందుకు సహకరించడంలేదన్న ప్రశ్నకు సమాధానం కరవవుతోంది. రెండవ గోదాములో భారీ ఎత్తున నిల్వలు తగ్గి ఉంటాయని, ఆ కారణంగానే వ్యాపారులు ఆ గోదాము తెరిచేందుకు సహకరించడం లేదేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి 50కేజీల బియ్యం బస్తాకు 750గ్రాముల బియ్యం తరుగుదలను లెక్కిస్తారని, మరో 250గ్రాముల బియ్యం లోడింగ్ అన్‌లోడింగ్ సమయంలో జరిగే నష్టం, బస్తాలు చిల్లులు పడి కారడం వల్ల జరిగే నష్టానికి తరుగుదల కింద అనుమతిస్తారని స్పష్టమవుతోంది. అయితే ఈ తరుగుదల కూడా బియ్యం నిల్వలు పూర్తిగా కొలిచినపుడు లెక్కలోకి వస్తుందని బియ్యం బస్తాల విషయంలో కాదని అధికారులు పేర్కొంటున్నారు. రైల్వే వ్యాగన్ల ద్వారా గోదాములకు చేరిన బియ్యం నికర బరువు, గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించే సమయంలో తూకం వేసినపుడు వచ్చే బరువును లెక్కించి తరుగుదల అపుడు లెక్క కడతారని వారంటున్నారు. ప్రస్తుతం బియ్యం బస్తాలు గోదాములో 4400కు పైగా ఉండల్సి ఉండగా 4వేల బస్తాలు మాత్రమే ఉండటాన్ని తాము ప్రశ్నిస్తున్నామని వెల్లడిస్తున్నారు. ఇది తరుగుదల కిందకు రాదని వారు స్పష్టం చేస్తున్నారు.

**గతంలో అధికార దర్పం ప్రదర్శించినందుకే అధికారుల ఆగ్రహానికి కారణమా? :** బేతంచెర్ల గోదాముల విషయంలో గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో వ్యాపారులు చూపిన దర్పం కారణంగానే నేడు వారికి తగిన సహకారం లభించడం లేదని గుసగుసలాడుకుంటున్నారు. బేతంచెర్ల వ్యాపారుల వ్యవహారానికి సంబంధించి ప్రత్యర్థి వర్గానికి ఎప్పటికపుడు ఉప్పందించినట్లు చర్చించుకుంటున్నారు. నాడు అధికార దర్పం చూపకుండా అధికారులకు తగిన 'సహకారం' అందించి ఉంటే నేడు దాడులకు అంతగా పరుగులు పెట్టేవారు కాదని లెక్కలు వేస్తున్నారు. అయితే కాకినాడ సమీపంలో సముద్రంలో వెళ్తున్న ఓడలో పౌర సరఫరాల బియ్యం నిల్వలు గుర్తించి వెనక్కి రప్పించడం, మాజీ మంత్రి పేర్ని నానికి చెందిన గోదాముల్లో సైతం బియ్యంనిల్వలు తగ్గడం వంటివి వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో బేతంచెర్ల గోదాముల వ్యవహారం భారీ చర్చకు దారి తీసింది. ఈ గోదాములను నిర్వహిస్తున్న వ్యాపారుల్లో ప్రధానంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రధాన అనుచరుడు ఒకరు ఉండటం కూడా రాష్ట్ర వ్యాప్త ప్రచారానికి దారి తీసింది. దీంతో బియ్యం వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి బుగ్గన బహిరంగ ప్రకటన చేయాల్సి వచ్చింది.

**కర్నూలు గోదాములకు అనుమతులు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదా :** కర్నూలు గోదాములకు అనుమతులు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదా అన్న ప్రశ్నకు అవునన్న సమాధానం వస్తోంది. బేతంచెర్ల వ్యాపారులు కర్నూలు గోదాముల్లో బియ్యం నిల్వలకు అనుమతులు తీసుకునే విషయంలో రాష్ట్ర స్థాయి అధికారులు వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. బేతంచెర్ల గోదాముల వ్యవహారంలో విచారణ పూర్తయి క్లీన్ చిట్ వస్తేనే వారికి అనుమతులు ఇవ్వడానికి అంగీకరిస్తూ సదరు ఫైలును ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ అధికారులకు పంపుతారని తెలుస్తోంది. బేతంచెర్ల వ్యాపారులపై నేరం రుజువైతే నిబంధనల ప్రకారం బియ్యం నిల్వలకు ఇచ్చిన అనుమతులు రద్దు అవుతాయని కూడా మరి కొందరుల అధికారులు వెల్లడిస్తున్నారు.

**ప్రైవేటు గోదాముల్లో నిల్వలపై ప్రభుత్వం పునరాలోచన :** రాష్ట్రంలో పౌర సరఫరాల బియ్యం నిల్వలు చేసేందుకు ప్రైవేటు వ్యాపారులకు ఇస్తున్న అనుమతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడ్డట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో లీజుకు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే పౌరసరఫరాల బియ్యం నిల్వలకు అవసరమైన గోదాములు ప్రైవేటు వ్యాపారుల నుంచి ప్రభుత్వ నిర్వహణలోకి వెళ్తే ఒకింత యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. మొత్తం మీద ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గోదాము నిర్వాహకుల మధ్య ఉన్న విబేధాలు రాష్ట్ర ప్రభుత్వం గోదాముల నిర్వహణ విషయంలో పునరాలోచనలో పడేలా చేసిందని భావిస్తున్నారు.

## శ్రీశైలంలో ఆది దంపతులకు వైభవంగా వెండి రథోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కావడంతో తెలుగు రాష్ట్రాల తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో స్వామివారి ఉచిత దర్శనానికి 4 గంటలు సమయం పడుతోందని పలువురు భక్తులు పేర్కొన్నారు. ముందుగా పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనార్థమై ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు. దీంతో ఆలయ క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఆలయ క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు :** ధర్మపథంలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానోఅలరిస్తున్నాయి. నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణకై దేవస్థానం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను చూడడంలో జాప్యం చేయకూడదని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు సంబంధించి సోమవారం వచ్చే అర్జీలే కాకుండా సీఎమ్ఓ నుండి, డిప్యూటీ సిఎం, మంత్రులు తదితర మార్గాల ద్వారా దరఖాస్తులు వస్తున్నాయని, వాటన్నింటినీ ప్రాధాన్యతా వారీగా వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లాగిన్ లో దరఖాస్తులను చూడని అధికారుల గురించి సమీక్షిస్తూ ఎట్ టు వ్యూ అర్జీలు కృష్ణగిరి తహశీల్దార్ లాగిన్ లో 19, ఓర్వకల్లు తహశీల్దార్ లాగిన్‌లో 11, కౌతాళం మండల సర్వేయర్ లాగిన్ లో 10, మున్సిపల్ కమీషనర్, కర్నూలు లాగిన్ లో 8, కర్నూలు అర్బన్ తహశీల్దార్ లాగిన్ లో 6, మండల సర్వేయర్, కృష్ణగిరి లాగిన్ లో 5, జాయింట్ కలెక్టర్ లాగిన్ లో 3, మండల సర్వేయర్, గోనెగండ్ల లాగిన్‌లో 3, కార్మిక శాఖ లాగిన్ లో 2, మండల సర్వేయర్ ఓర్వకల్లు లాగిన్ లో 2, మండల సర్వేయర్ తుగ్గలి లాగిన్ లో 2, కర్నూలు తహశీల్దార్ లాగిన్ లో 2 పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే ఓపెన్ చేసి చూసి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో జాయింట్‌కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సంతృప్తి చెందేస్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి వినతిని పరిశీలించి సంతృప్తి చెందేస్థాయిలో ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. సీఎం కార్యాలయం నుంచి 18 దరఖాస్తులను పరిష్కరించాలని ఇందులో మూడు దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయని వీటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ముందు జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ కార్యకలాపాలకు సంబంధించిన దస్త్రాలన్నీ ఈ ఆఫీస్ ద్వారా సిగ్నేచర్ లేకుండా వస్తున్నాయని ఈ ఫైలింగ్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన పొంది ప్రతి ఫైలు ఈ ఆఫీస్ ద్వారానే రావాలన్నారు. ఎన్టీఆర్ భరోసా కింద ఈనెల 31వ తేదీన పెన్షన్లు పంపిణీ చేసేందుకు ముందుగానే నగదును డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు నెలలు తీసుకోకపోతే మూడు నెలల మొత్తం పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. 14 మండలాల్లోని 48 చెంచుగూడెంలలో ఆధార్ లేక అనేక సంక్షేమ పథకాలా లబ్ధి పొందలేకపోతున్నారని ఆధార్ లేని గిరిజనులకు ఓటరీ లేకుండా జనన ధృవీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అపార్ ఐడి జనరేషన్ కొరకు ఇంటర్ విద్యార్థులకు కూడా జనన ధృవీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా 199 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

## నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

### డిసెంబర్ 31రాత్రి తనిఖీలు..ఎస్సై సురేష్ బాబు



**పాములపాడు, మేజర్ న్యూస్ :** కొత్త సంవత్సరానికి వెల్కమ్ చెబుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ ఎంజాయ్ చేద్దాంలే అనుకుంటే పోలీసులు చేతుల్లో చుక్కలు కనిపిస్తాయి సందర్భంగా పాములపాడు ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ డిసెంబర్ 31న ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రాత్రి పది గంటల నుండి వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని అవసరమైతేనే బయటకి రావాలని సూచించారు అశ్లీల కార్యక్రమాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు డీజే సౌండ్లు బాణాసంచాలు బైకులు సైలెన్సర్‌లో తీసేసి అధిక శబ్దం వచ్చేలా రోడ్లపై తిరుగుతూ కేసులు పెడతామన్నారు మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు మైనర్లు గాని నడిపితే వాళ్ల తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని దయచేసి పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## న్యాయవాదుల నిరసన

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఇటీవల గాలివీడు, అనంతపురంలో న్యాయవాదులపై పోలీసులు దౌర్జన్యం చేసిన ఘటనల నేపథ్యంలో ఎమ్మిగనూరు న్యాయవాదులు తీవ్రంగాఖండించారు. సోమవారం వారు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహసీల్దార్ శేషఫణికు, అలాగే డీఎస్పీ ఉపేంద్ర బాబు కు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాటాడుతూ పోలీసు అధికారుల మితిమీరిన చర్యలను, ప్రత్యేకించి శ్రీ జల్లా సుదర్శన్ రెడ్డిపై అఘాయిత్యం, వేధింపులు అలాగే సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతి పోలీసులే కారణమని ఆరోపించారు. దీన్ని వైఎబిఏ తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బాధ్యులైన అడ్వకేట్, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. నిరసన కార్యక్రమంలోన్యాయవాదులు యం.కె.గురురాజారావు, రఘురాం, మురళి కృష్ణ, భాష, సురేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, జగన్నాథ రెడ్డి, సైఫుల్ల, దామోదర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, మారుతి, సుధాకర్, నబి, ఊరుకుండు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## పశుగణన కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయండి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ఎన్యూమరేటర్లు త్వరగా పూర్తి చేయాలని ఆళ్లగడ్డ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య సూచించారు. సోమవారంనాడు బనగానపల్లె పశువైద్యశాలలో సిబ్బందితో సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉంటూ తమకు నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని తెలిపారు. బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు మారుతీ సకారం మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వార కేవలం పేయదూడల మాత్రమే పుట్టే యదసూదులు ప్రతి ఒక వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, రామ్ కుమార్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, చిన్నబాబు, శ్రీకాంత్ రెడ్డి, భారతీ దేవి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇరువర్గాల మధ్య వాగ్వాదం

### పోలీస్‌స్టేషన్ చేరిన పంచాయతీ

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలోసోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో టిడిపికి చెందిన ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెవెన్యూ సదస్సులో గ్రీన్ కో పరిశ్రమ ఏర్పాటు కు భూములు ఇవ్వమని ఎంపీ వర్గము తాసిల్దార్ తో మాట్లాడుతుండగా ఎమ్మెల్యే వర్గం ఇది కేవలం రెవెన్యూ సదస్సు కు సంబంధించినది మాత్రమే గ్రీన్కోకు సంబంధం లేదని మండల తాసిల్దార్ ను ప్రశ్నించవద్దు అని ఎమ్మెల్యే వర్గం అడ్డు చెప్పడంతో ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడికి ప్రయత్నిస్తుండగా అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపివేయగా ఈ విషయం పై ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో పంచాయతీ స్టేషన్కు చేరింది. ఈ విషయంపై ఎస్ఐని వివరణ అడగగా ఇంకా కేసు నమోదు చేయలేదని విచారిస్తున్నామని తెలిపారు.

# మాదాసు, మాదారు కురుబలకు ఎస్సీ సర్టిఫికెట్లు రద్దు చేయాలి

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** ఆస్పరి మండలంలోని మాదాసు కురువ, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లను రద్దు చేయాలని ఎంఎస్‌పి జిల్లా కార్యదర్శి పెద్ద సంజప్ప మాదిగ, ఎంఎస్‌పి ఆస్పరి మండల అధ్యక్షులు చిగిలి రామాంజనేయులు మాదిగ, ఆస్పరి మండల ఎమ్మార్పిఎస్ మండల ఇంచార్జీ చిన్న సంజన్న మాదిగలు ప్రభుత్వ అధికారులకు విజ్ఞాప్తి చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ, మాదాసి కురువ, మాదాసు కురుబలు లేరన్నారు. రెవిన్యూ ప్రభుత్వం అధికారులు గ్రామాల్లోను ఎస్సీ సర్టిఫికెట్లు మంజూరు చేసే విషయంలో పూర్తిగా విచారణ చేసి ఎస్సీ కుల సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహాశీల్దార్ శివశంకర్ నాయక్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో



కరుణాకర్ మాదిగ, హనుమంతు మాదిగ, గాలప్ప మాదిగ, రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

**దేవనకొండ మేజర్ న్యూస్ :** స్థానిక ఎఫ్ఆర్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్ష పోటీలకు ఎంపికైనట్లు ఎఫ్ఆర్ హైస్కూల్ కరెస్పాండెంట్ రఘునాథ్ తెలిపారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఆదోనిలో జరిగిన అబాకస్ వేదిక్,మాథ్స్ జిల్లా స్థాయి పోటీలలో ఎఫ్ఆర్ హైస్కూల్ విధ్యార్థులు రూప (8వ తరగతి)ప్రశాంత్ (ఐదవ తరగతి) మంచి ప్రతిభ కనబరచి మొదటి ద్వితీయ స్థానాల్లో నిలవడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగిందాన్నరు.ఈ విద్యార్థులు ఈ నెల 9వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉచ్చీరప్ప, లక్ష్మీదేవి, వసంత, రవీంద్ర, రంగస్వామి, షభాన, శ్రావణి, హేమలత;ఉష తదితరులు పాల్గొన్నారు.

### మండల పరిషత్ సిబ్బంది

# నిరసన

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై రాజకీయ నాయకుల దాడిని ఖండిస్తూ సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో రవిప్రకాష్, వ్యవసాయ శాఖ ఏఈవో రాణెమ్మ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, విస్తరణ అధికారి వెంకటేశ్వరరావు నల్ల బ్యాడ్జిలు ధరించి తమ నిరసన తెలిపారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మండల పరిషత్ సిబ్బంది



ఎంపీ బస్తిపాటి నాగరాజు సర్పంచ్ సుధాకర్‌కు కేక్‌ను తినిపిస్తున్న దృశ్యం

### ఎంపీ సమక్షంలో

# సర్పంచ్ సుధాకర్ జన్మదిన వేడుకలు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు సమక్షంలో హొళగుంద మండలం ఎండిహళ్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేయించి సర్పంచ్‌కు ఎంపి తినిపించారు.ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాజకీయరంగంలో అంచలంచలుగా ఎదగాలని సర్పంచ్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, రామక్రిష్ణ,బిజెపి బసవరాజు, ఎండిహళ్లి సంతోశ్, శరణప్ప, కురవల్లి రమేశ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా

# పండ్లు, బ్రెడ్లు పంపిణీ

### – బిజెపి నాయకులు

**ఆదోని,మేజర్ న్యూస్:** ఆదోని ముస్లీం మైనార్టీ మోర్చ, రాష్ట్ర బిజెపి, ముస్లీం మైనార్టీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఆదోని మహిళ మాత శిశు వైద్యశాలలో గర్భిణీలకు, బాలింతలకు పాలు, బ్రెడ్లు పంపడి చేయడం జరిగిందని బిజెపి సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన్ శర్మ, న్యాయవాది లోకేష్ కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ, ఆదోని ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మాత శిశు వైద్యశాలలో గర్భవతులు, బాలింతలు కూడ ఎమ్మెల్యే నూరేళ్లు ఉండాలని కోరారు.



బాలింతలకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

ఈ కార్యక్రమంలో పూల రఘు, కడిమెట్ల రామకృష్ణ, ఉరుకుందప్ప, న్యాయవాది చాంద్ బాష, నభీరసూల్, మురారి, టైలర్ వలి, నరసింహులు, బిజెపి నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

# క్రైం స్పాట్

## పట్టపగలే దొంగతనం

**గడివేముల మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గడివేముల ప్రధాన రహదారి అయిన నంద్యాల నందికొట్కూరు రోడ్డు సిఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న కురువ పెద్దన్న ఇంట్లో పట్టపగులే దొంగతనం జరిగింది. కుటుంబ సభ్యులు సొంత పొలానికి పనిమీద వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో బీరువా తాళం పగలగొట్టి బీరువాలో ఉంచిన 8 తులాల బంగారం 13 వేల రూపాయలు నగదు దొంగిలించినట్లు బాధితుడు కురువ పెద్దన్న తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.



## ట్రాక్టర్ బోల్తాపడి కూలీ మృతి



మృతి చెందిన కూలి

**గడివేముల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెసరవాయి కరిమద్దెల గ్రామాల మధ్య ట్రాక్టర్ అదుపు తప్పి బొల్తాపడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ నుంచి వివిధ మండలాల్లో కూలీ పనులు చేసుకునేందుకు ప్రతి ఏడాది బండిఆత్మకూరులోని రామాపురం గ్రామంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని కూలీ పనులు చేసుకునేందుకు వస్తుంటారు. సోమవారం పాములపాడు మండలం వాడల గ్రామంలో వరినాట్లు వేసేందుకు పార్నపల్లె గ్రామానికి చెందిన పాణ్యం నాగేశ్వరరెడ్డి ట్రాక్టర్ నందు పది మంది కూలీలు వెళ్తుండగా కరిమద్దెల గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన సునీల్ సద్దార్ (49) ట్యాలీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో తోటి కూలి బరున్ సద్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

### శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైలంలో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ జీ.ప్రసాదరావు సోమవారం తెలిపారు.ఒక ఆటోలోని బ్యాటరీని,2 టీ స్టాల్లోని సిలిండర్లను దొంగిలించినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించామన్నారు. శ్రీశైలానికి చెందిన మస్తాన్ వలి, భాస్కర్ ఇద్దరిని పట్టుకొని,వారి నుంచి సొమ్ము రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది గురువయ్య, రాజేంద్ర, రఘునాథుడు,శివ మహేందర్ రెడ్డి, బాలకృష్ణ,నాన్ నాయక్ ఉన్నారు.



## యువకుడిపై దాడి.. కేసు నమోదు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన తులసిరెడ్డి, చరణ్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డిలు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాత గొడవల కారణంగా ఈ దాడి జరిగిందని అన్నారు. విష్ణు వర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

**దొర్నిపాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని గుండుపాపల గ్రామంలో గుర్తు తెలియని మగ శవం లభ్యమైనట్లు ఎస్.ఐ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ వెంకటేష్ మాట్లాడుతూ సుమారు 35 నుండి 40 సంవత్సరాలలోపల వయస్సు మగ శవం గ్రామంలోని బస్టాండు వద్ద గల సైడు కాల్వలలో పడిందని ఇతని యొక్క ఆచూకి తెలియరాలేదని గత రెండు రోజుల నుంచి వంటెల గల గుండుపాపల గ్రామాలలో తిరుగుతూ ఉన్నాడని ఈ దినం అనగా 30.12.2024వ తేదీన ఉదయం గ్రామ బస్టాప్ వద్ద ఉన్న సైడు కాల్వలో పడి చనిపోయి ఉన్నది గ్రామస్థులు గుర్తించి పోలీసు వారికి తెలియజేశారని ఆయన తెలిపారు. కావున ఈ వ్యక్తి యొక్క ఆచూకి తెలిసిన యెడల మండల కేంద్రమైన దొర్నిపాడు పోలీసు స్టేషన్ ఎస్.ఐ సెల్ నెం. 9121101178, సి.ఐ సెల్ నెం. 9121101166 నెంబర్లకు తెలియజేయగలరని తెల్పుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య



# సమస్యల పరిష్కారానికి కృషి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని రాజ్ థియేటర్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించి వాటిని పరిష్కరించారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

## గురురాజ పాఠశాల ఉపాధ్యాయురాలికి

# సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు



షేక్ బేగం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని గురురాజ పాఠశాల కోఆర్డినేటర్ షేక్ బేగంకు సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు అందుకోనున్నారు. దక్షణాధి ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కోఆర్డినేటర్ షేక్ బేగం ఎన్నికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. 16 ఏళ్ళుగా ఉపాధ్యాయురాలిగా సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు. గుంటూరులో ఈ అవార్డును అందజేస్తారని షేక్షావలిరెడ్డి తెలిపారు.

# టిడిపి కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే గౌరు

**కల్లూరు మేజర్ న్యూస్ :** కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ మైనారిటీ సెల్ టీడీపీ కార్యకర్త హుస్సేన్ భాష నెల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అతన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చదువుల తల్లుల జయంతి వారోత్సవాలను

# జయప్రదం చేయండి



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** చదువుల తల్లులు సావిత్రిభాయి పూలే, ఫాతిమా షేక్ ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలనీ రాయల సీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న పిలుపునిచ్చారు.సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్త్రీ విముక్తి (బానిసత్వం ) విద్యతోనే సాధ్యమని సావిత్రి బాయిపూలే చెప్పారని భారత దేశ తొలి మహిళ ఉపాధ్యాయులు చదువుల తల్లులు వారి జయంతి వారోత్సవాలను కర్నూలు జిల్లా పరిషత్ హాల్లో 2025 జనవరి మూడో తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ నాయక్,రాజు,శేఖర్, పాఠశాల విద్యార్థుల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ గ్రామంలో రెవెన్యూ సదస్సు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామంలోని రైతులు వారి భూమి హక్కు సమస్యలు పేరు మార్పులు సరిహద్దు సమస్య సర్వే నెంబర్లు మార్పులు మొదలగు పిటిషన్లపై ఆర్టిజిఎస్ గ్రీవెన్స్ పోర్టల్ లో ప్రత్యేకంగా నమోదు చేయించారు. మండల తాసిల్దార్ విద్యాసాగర్ రైతుల నుంచి సమస్యల పై అర్జీలను స్వీకరించారు. ఈ రెవెన్యూ సదస్సుకు 33 అర్జీలు వచ్చాయని వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేర్ శంకర్ మాణిక్యం, కాల్వబుగ్గ ఆలయ ఈవో మద్దిలేటి, వీఆర్వో మహబూబ్ బాషా, గ్రామ రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు విలేజి సర్వేర్లు, టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.



# అలరించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

**కల్లూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం క్రింద ఉన్న అన్ని పాఠశాలల్లోని 8,9,10 తరగతుల విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి ఉత్తమ ప్రాజెక్ట్, ప్రతిభగల విద్యార్థులను ఎంపిక చేసి సోమవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు మండల విద్యాధికారులు శ్రీనివాసులు, వనజ కుమారి పర్యవేక్షణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శరీన్ నగర్ లో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ను కల్లూరు మండల అభివృద్ధి అధికారి జి నాగ శేషాచల రెడ్డి ప్రారంభించారు ప్రతీ ప్రాజెక్ట్ నూ ఆసక్తిగా సందర్శించారు. పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడి అభినందించి, ప్రోత్సహించారు. విద్యార్థులు ప్రతీ రోజూ శాస్త్రీయంగా క్రొత్త ఆవిష్కరణలు వార్తలను తెలుసుకుంటూ ఉండాలి అన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి సైన్స్ ఎగ్జిబిషన్ ను సందర్శించి విద్యార్థులతో ప్రాజెక్ట్ గురించి చర్చించారు. కల్లూరు మండలం లోని ఆయా పాఠశాలల నుండి మొత్తం 8 అంశాల మీద 39 ప్రదర్శనలు పాల్గొన్నాయి. జడ్.పి.హెచ్.ఎస్ శరీన్ నగర్ హెచ్ఎం సుజాత,



సైన్స్ ఉపాధ్యాయుడు ఈ వై దాసు , మండలం లోని సైన్స్ ఉపాద్యాయులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా మండలము లోని గురుకుల జూనియర్ కళాశాలల్లోని సైన్స్ లెక్చరర్స్ విచ్చేసి ఉత్తమ ప్రదర్శనలను విజేతలుగా నిర్ణయించారు. ప్రతీ అంశములో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు పంపిస్తామని మండల విద్యాధికారులు శ్రీనివాసులు, వనజ కుమారి తెలిపారు.

# ఎర్రమఠంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఎర్రమఠం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1 నుంచి జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు దాతల సహకారంతో సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చిన్న నాగేశ్వరరావు, నరసింహుడు, వెంకటరమణ, జీవన్‌బాబు, బాలగోపాల్, రాజులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 31వ తేదీలోపు తమ జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ పోటీలు ఉంటాయని అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 10,016, రెండవ బహుమతిగా రూ. 7,016, మూడవ బహుమతిగా రూ. 5,016 ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేకాకుండా గ్రామ స్థాయిలో గెలుపొందిన వారికి రూ. 5,016, రూ. 3,016, రూ. 2,016 బహుమతులు ఇవ్వనున్న ట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## జనసేన పార్టీ విలువలతో కూడిన రాజకీయం చేసింది..

# ఇక నుండి కురుక్షేత్రంలా జనసైనికులు పోరాడాలి

**ఆలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో జనసేన పార్టీ విలువలతో కూడిన రాజకీయాలు చేసిందని ఇప్పటినుండి జన సైనికులు కురు క్షేత్రం యుద్ధం లా ప్రతిపక్షాలతో పోరాడాలని ఆలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నెకల్ వెంకప్ప అన్నారు.సోమవారం అమరావతిలో ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ప్రభుత్వ విప్ ఎంఎల్ సి పిడుగు హరిప్రసాద్ ను కలిసి ఆలూరు అభివృద్ధి పై చర్చించారు. ఇప్పటి వరకు శాస్త్రీయంగా,నైతికంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని, ఇకనుంచి క్షేత్రస్థాయిలో కఠినమైన పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.అలాగే ఆలూరు నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ కు వివరించారు. ఎన్డీఏ కూటమి పట్ల విశ్వాసంతో, తెలుగుదేశం నాయకులతో కలిసి జనసేన సైనికులు పని చేయాలని ప్రోత్సహించారు. జనసేన పార్టీ మరియు కార్యకర్తల కోసం ఎంతదూరమైనా పోరాడతానని, అందుకు పూర్తి మద్దతు, సహకారం అందించాల్సిందిగా కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ చింత సురేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.



హరిప్రసాద్‌తో జనసేన ఆలూరు ఇంఛార్జ్ తెర్నెకల్ వెంకప్ప

## సహకార సంఘాల్లో

# ఈకేవైసీ తప్పని సరి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ఆయా సహకార సంఘాలలో ఈకేవైసీ సభ్యులు తప్పని సరిగా చేయించుకోవాలని సహకార సంఘాల ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని భీమునిపాడు, పెద్దకొప్పెర్ల, లింగాల, కోవెలకుంట్ల సహకార సంఘాల్లోని సభ్యులందరూ ఆయా గ్రామ సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకుంటే తప్పని సరిగా ఓటీపీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, సభ్యులందరూ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

# నిబంధనలు పాటిస్తూ... న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలి

- శాంతిభద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పువు
- ఈవెంట్లు జరుపుకోవాలంటే అనుమతులు తప్పనిసరి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** నూతన సంవత్సర వేడుకలను పోలీసు అధికారుల నిబంధనలను పాటిస్తు సంతోషంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని డిఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. సోమవారం నూతన సంవత్సర వేడుకలపై డిఎస్పి మాట్లాడుతూ ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలో 30 చట్టం అమలులో ఉంటుందని, పోలీసులు సూచించిన నిబంధనల ప్రకారం వేడుకలు జరుపుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఈవెంట్లు జరుపుకునే వారు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అవుట్ డోర్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో డిజె సౌండ్ బాక్సులు, బాణాసంచ కాల్చడాన్ని నిషేధించామన్నారు. కార్యక్రమాలు జరుపుకునే వారు 10 గంటలలోపు జరుపుకోవాలని 10 గంటల తర్వాత తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రంక్అండ్ డ్రైవ్ పరీక్షలు పగడ్బంధిగా నిర్వహిస్తామన్నారు. బైక్‌లకు సైలెన్సర్‌లు తీసివేసి శబ్దాలు చేయడం, అతివేగంగా నడపడం , మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆకతాయిలు మితిమీరి ప్రవర్తించి రోడ్డుపై చిందులు వేయడం, మందుబాబులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చిత్రీకరించేందుకు వీడియో, డిజిటల్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, పోలీసులకు సహకరించాలని కోరారు. పెట్రోలింగ్ ముమ్మరం చేసి , ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచుతామన్నారు. ప్రజలంతా నిబంధనలను పాటిస్తు ఇతరులకు ఇబ్బంది లేకుండా నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ ఆత్మకూరు పోలీసు డివిజన్ పరిధిలోని ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్

### గుంతలు రహిత ఏపీ కాస్త

# గుంతల ఏపీగా మారిన వైనం


పూజ కార్యక్రమం చేసిన ప్రాంతంలో గుంతలు పూడ్చని వైనం

- చంద్రబాబు,పవన్ ఆశయాలకు తూట్లు పొడిచిన కాంట్రాక్టర్
- ఆలూరు, పెద్ద హెూతూరు రోడ్డుకు రూ.20 లక్షల నిధులు మంజూరు
- రెండు నెలలు కావస్తున్నా గుంతలు పూడ్చని అధికారులు
- ఆలూరుకు వర్తించని మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఏపీ కార్యక్రమం

**ఆలూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ పాట్ హెూల్ ఫ్రీ ఏపి పథకం ఆలూరు మండలంలో నీరుగారింది. మండలంలో ఆలూరు, పెద్ద హెూతూరు మధ్య వైసిపి ప్రభుత్వ హాయం నుండి రోడ్డు గుంతలు పడడంతో ప్రయాణికులకు ఇబ్బందులు గురి అయ్యేవారు.అయితే టీడీపి ప్రభుత్వం సంక్రాంతికి వచ్చే బంధువులు వైసీపీ ప్రభుత్వంలోగా కాకుండా టీడీపి ప్రభుత్వంలో ప్రయాణం సాఫీగా ఉండాలని తలంచి కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నిధులు ఆయా మండలాలకు విడుదల చేస్తే జిల్లాలో అన్నిచోట్ల రాష్ట్ర, జాతీయ రహదారులలో సైతం గుంతలు పూడ్చి తయారు రోడ్డులు వేసి సంక్రాంతి కానుకగా ప్రభుత్వానికి అందిస్తుండగా ఆలూరు, పెద్దహెూతూరు గ్రామాల మధ్యలో కాంట్రాక్టర్ గుంతలు పూడ్చకుండా కేవలం రాళ్ళ గరుసు వేసి అలాగే బిల్లులు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.ఇంకా కొన్ని రోజులు ఆగితే కర్నూల్,బళ్లారి రహదారికి పూర్తి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని


ప్రమాదాలకు నిలయంగా ఆలూరు,పెద్ద హెూతూరు రోడ్డు

దీంతో గుంతలకు ప్యాచ్‌లు అందులో కొట్టుకొనిపోతాయని అభిప్రాయంలో ఉన్నట్లు తెలుస్తోంది. నియోజక వర్గంలో ఇతర మండలాల్లో చేపట్టిన గుంతలు పూడ్చే కార్యక్రమం, సిసి రోడ్లు పనులు పూర్తవగా భూమి పూజ చేసిన చోట గుంతలు పూడ్చకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ఇంకా వైసీపీ ప్రభుత్వం ఉందనుకొని



గుంతల రహిత ఏపీ కార్యక్రమాన్ని ప్రారంభించిన వీరభద్ర గౌడ్ (ఫైల్ ఫొటో)

భ్రమలో ఉన్నారని గత ప్రభుత్వం లో పనులు చేయకున్నా బిల్లులు చేసుకున్న సంఘటనలు వెలుగులోకి రోజు వస్తుండగా ఇక్కడ కాంట్రాక్టర్ ఇంకా వైసీపీ ఉహల్లోనుండి బయటికి రావడం లేదు.ఇప్పటికైనా జిల్లా పార్టీ నాయకులు, జిల్లా అధికారులు రెండు నెలలుగా పనులు చేయకుండా ఉన్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని పనులు వేరొకరికి అప్పగించాలని టీడీపి కార్యకర్తలు కోరుతున్నారు.దీనిపై సంబంధిత ఆర్ అండ్ బి జె.ఈ ని వివరణ అడుగగా ఇటీవల వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో గుంతలు పూడ్చినా మళ్లీ వర్షానికి గుంతలు పడుతాయని కాంట్రాక్టర్ వర్షాలు తగ్గిన తర్వాత వేద్దామని అనుకుంటున్నారని మరో వారంలో పనులు మొదలు పెడతామని తెలిపారు.

## సామాన్యుల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సర వేడుకల పేరుతో సామాన్యుల స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపు కోవాలని 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత అన్ని దుకాణాలు మూసివేయాలన్నారు జనం గుంపులుగా ఉండరాదని రాత్రి వాహనాల తనిఖీ చేపడతామని ఎవరైనా మద్యం తాగి వాహనాలను నడిపిన బైక్ సైలెన్సర్స్ తీసేసి నడపరాదని రోడ్ల పైన కేకులు కట్ చేయడం డీజె లకు పర్మిషన్ లేవని ప్రైవేటు పబ్లిక్ ప్రదేశాల్లో వేడుకలు నిషిద్ధమని తెలిపారు. ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించి నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించరాదని అటువంటివారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.


## పాలకొల్లులో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పాలకొల్లు గ్రామంలో పారిశుద్ధ్య పనుల కార్యక్రమం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ సోమవారం తెలిపారు. సర్పంచ్ చదువుల సుజాతమ్మ, టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. దోమల నుంచి సీజనల్ వ్యాధుల ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యల్లో భాగంగా మురుగునీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో జెసిబి తో శుభ్రపరచడం జరిగిందని కాల్వలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల వ్యాప్తి చెందకుండా అరికడుతున్నామని తెలిపారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీరామ్‌కుమార్

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** ఉయ్యాలవాడ బీజేపీ మండల అధ్యక్షుడిగా కొత్తమిద్దె శ్రీరామ్‌కుమార్‌ను బీజేపీ పార్టీ ప్రకటించింది. పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగన్న, పార్టీ మండల రిటర్నింగ్ అధికారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎంపీక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్‌కుమార్‌కు సభ్యులు అభినందనలు తెలిపారు. శ్రీరామ్ మాట్లాడుతూ బీజేపీ పార్టీకి తాను విధేయుడనై ఉంటానని, పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నారు. ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకులకు, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరాములు, రామయ్య, గురుస్వామి, దస్తగిరి బాష, సంజీవరాయుడు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీరామ్‌ను అభినందిస్తున్న కార్యవర్గ సభ్యుడు

## న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### - శిరివెళ్ళ సీఐ, ఎస్ఐ


శిరివెళ్ళ సీఐ వంశీధర్


ఎస్ఐ పీరయ్యయాదవ్

**శిరివెళ్ళ, మేజర్‌న్యూస్ :** శిరివెళ్ళ మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శిరివెళ్ళ సీఐ వంశీధర్, ఎస్ఐ పీరయ్యయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ రాత్రి 10 గంటలలోపు వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్ళాలని, ఎవరైనా వీధుల్లో, గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 100% ఫలితాలు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో ఉండి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని రిటైర్డ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాజీ ఎమ్మెల్సీ షేక్ ఇక్బాల్ మహమ్మద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు 40 వేల రూపాయల విలువగల స్టడీ మెటీరియల్ 129 మందికి పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి దేశ అభివృద్ధిని వారి సర్వతోముఖాభివృద్ధి కొరకు నా వంతు కర్తవ్యం గా స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందని ఈ స్టడీ మెటీరియల్ ద్వారా ఒక ప్రణాళిక ఏర్పరచుకొని పదో తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వారికి విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్నా సైమన్, గౌరీ నందన రెడ్డి, అనిత, భారత్ స్పోర్ట్స్ మాస్టర్ మద్దిలేటి, పెద్ద స్వామి, లక్ష్మీనారాయణ, ఏవిజేవీ ప్రసాద్,వెంకటేశ్వర్లు,లింగస్వామి, బోధ నేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

### మాజీ టీడీపీ ఇంఛార్జ్ ఆధ్వర్యంలో

## కూటమి ఎమ్మెల్యే పార్థసారధి జన్మదిన వేడుకలు

**ఆదోని, మేజర్‌న్యూస్:** ఆదోని మండలంలోని మండిగిరి టీడీపీ మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పార్థసారధి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో మాజీ టీడీపీ ఇంచార్జ్ కృష్ణమ్మ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాదిక్ వలి, మాజీ ఎంపిపి మురళీ, మాజీ ఎంపిటీసి, సర్పంచ్ మాధవ్, నాయి బ్రాహ్మణ నాయకుడు గోపాల్, సంతేకుడ్లూరు రాఘవరెడ్డి, దేవేంద్ర, బైచిగేరి రామాంజి, మండిగిరి బాబురావు, రేవన్ కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


నాయకులకు కేక్ తినిపిస్తున్న కృష్ణమ్మ

### నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు

## పోలీసు నిబంధనలను పాటించాలి : ఎస్.ఐ


మాట్లాడుతున్న ఎస్.ఐ వెంకటేష్

**దొర్నిపాడు, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సర వేడుకలు ప్రజలందరూ ఆరోగ్యకరమైన వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున పోలీసు నిబంధనలు పాటించి ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్.ఐ వెంకటేష్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం త్రాగి వాహనం నడపడం మోటారు వెహికల్ చట్టం 185 ప్రకారం నేరమని దానికి 10వేలు జరిమానా లేక 6నెలల జైలు శిక్ష అని మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వ్యక్తి యొక్క డ్రైవింగ్ లైసెన్సు 3 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలంపాటు శాస్వతంగా సస్పెండ్ చేయడం జరుగుతుందని అలాగే మద్యం షాపులు ప్రభుత్వం అనుమతించిన సమయం వరకే తెరిచి ఉంచాలని మైనర్లు, మోటారు సైకిళ్లు కానీ , వాహనాలు కానీ నడపకూడదని ఇలా చేసినచో వాహన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తీసివేయకూడదని అలా తీసివేసిన వాహనాల యజమానులపై మరియు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని వాహనాలు అధిక వేగంతో ప్రమాదకరంగా డ్రైవింగ్ మరియు పబ్లిక్ స్థలాల్లో రేసింగ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని వేడుకల పేరుతో మహిళలపట్ల ఇతర వాహనదారులపట్ల అసభ్యకరంగా అమర్యాదగా ప్రవర్తించకూడదని కొందరు వ్యక్తులు శుభాకాంక్షలు చెప్పే నెపంతో ఈవ్ టీజింగ్, స్నాచింగ్ చేయుటకు అవకాశాలు ఉండవచ్చునని కనుక మహిళలు జాగ్రత్తగా ఉండాలని పోలీసు వారికి వెంటనే సమాచారం అందించాలని రోడ్లపై ట్రాఫిక్‌జాబ్ చేసి కేకులు కట్ చేయడం వంటివి చేయకూడదని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీజేలకు ఎలాంటి అనుమతి లేవని రోడ్లపైన కానీ రోడ్ల జంక్షన్‌లో కానీ ఎలాంటి క్రాకర్స్ , టపాసులు పేల్చరాదని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# AP TET Paper IIA

## Prevoius Paper (Held on 17/10/2024)

(గత సంచిక తరువాయి.....)

**91.** x-4y=5 **అనే సమీకరణానికి**

1. సాధన లేదు.
2. ఒకే సాధన కలదు.
3. రెండు సాధనలు కలవు.
4. అనంతమైన సాధనలు ఉన్నాయి.

**92. (-2, -4) మరియు (3,-2) బిందువుల మధ్య దూరం (యూనిట్లలో)**

1. రూట్ 23 2. రూట్ 29
3. 7 4. 9

**93. క్రింది పౌనఃపున్య విభాజన పట్టికలో మధ్యగత తరగతి**

| మార్కులు | విద్యార్థుల సంఖ్య |
|---|---|
| 0-10 | 12 |
| 10-20 | 18 |
| 20-30 | 20 |
| 30-40 | 6 |
| 40-50 | 3 |

1. 20-30 2. 30-40
3. 0-10 4. 10-20

**94. భూమి వ్యాసం 12756000మీ. అను వాక్యంలో కనబడే సంఖ్య ప్రామాణిక రూపం**

1. $1.2756\times10^7$మీ
2. $12.756\times10^6$మీ
3. $1.2756\times10^6$మీ
4. $12.756\times10^7$మీ

**95. త్రిభుజము ABC లో ఒక మధ్యగత రేఖ AM అయితే క్రింది వానిలో అసత్య ప్రవచనాన్ని గుర్తించండి.**

1. AB+BC+CA>AM
2. AB+BC+CA>2AM
3. AB+BC+CA<2AM
4. AB+BC>CA

**96. ప్రకటన : 10 సెం.మీ. భూ వ్యాసార్థం, 9 6/11 సెం.మీ. ఎత్తు కల్గిన శంఖువు ఆకార పాత్ర 1 లీటరు నీటిని ఇముడ్చుకోగలదు.**

కారణం : శంఖువు ఆకార పాత్రల ఘనపరిమాణాన్ని V= 1/3 ..... $r^2h$ సూత్రాన్ని ఉపయోగించి కనుగొంటాము.

1. ప్రకటన మరియు కారణం రెండూ సత్యం మరియు కారణం ప్రకటన యొక్క సరైన వివరణ
2. ప్రకటన అసత్యం కాని కారణం సత్యం.
3. ప్రకటన సత్యం కాని కారణం అసత్యం.
4. ప్రకటన మరియు కారణం రెండూ అసత్యం.

**97.** 2a+3b, b-a, 4a-2b **భుజాలుగా కలిగిన త్రిభుజ చుట్టుకొలత**

1. 5a+2b 2. 5a-2b
3. 3a-4b 4. 4a-3b

**98. ఒక త్రిభుజం యొక్క భుజాల కొలతలు 9 సెం.మీ., 12 సెం.మీ., మరియు 15 సెం.మీ. అయితే త్రిభుజ వైశాల్యం (చదరపు సెం.మీ.లలో)**

1. 48 2. 50
3. 54 4. 60

**99. భావజ్ఞ తన దీర్ఘ చతురస్రాకార పొలమును ఇనుప తీగతో మూడుసార్లు చుట్టదలచింది. ఆ పొలము యొక్క కొలతలు 7 2/3× 5 3/7 మీ.గా ఉన్నవి. అయిన ఆమె కొనవలసిన ఇనుప తీగ పొడవు (మీ.లలో)**

1. 13 2/21 2. 26 4/21
3. 78 4/7 4. 39 2/7

**100. 52 పేక ముక్కల కట్టనుండి ఒక పేకముక్కను తీసిన అది ముఖకార్డు రాకపోవటానికి గల సంభావ్యత**

1. 3/13 2. 4/13
3. 6/13 4. 10/13




**101.ఎ) ఒక ప్రయోగంలో ఒక ఘటన ఎప్పుడూ సాధ్యపడకపోతే దానిని ఖచ్చిత ఘటన అంటారు.**

**బి) ఒక ప్రయోగంలో అన్ని ఘటనల సమ్మేళనము ప్రతి రూప ఆవరణ అయిన వాటిని పూర్ణ ఘటనలు అంటారు.**

1. ఎ సత్యం, బి సత్యం
2. ఎ అసత్యం, బి అసత్యం
3. ఎ సత్యం, బి అసత్యం
4. ఎ అసత్యం, బి సత్యం

**102.114. 109, 104...... అంకశ్రేఢిలో ఎన్నవ పదం మొదటి ఋణాత్మక పదం**

1. 23వ 2. 24వ
3. 26వ 4. 25వ

**103.సింధూలోయ నాగరికత ప్రజలు (క్రీ.పూ. 3000 కాలంలో) నిర్మాణాలలో వాడిన ఇటుకల పొడవు:వెడల్పు:మందముల నిష్పత్తి**

1. 3:2:1 2. 4:3:1
3. 4:2:1 4. 4:3:2

**104.** B⊂A అయితే (a) AUB=A, (b) B-A=ϕ (c) A∩ B=B

1. 'ఎ' మాత్రమే సత్యం
2. 'ఎ' మరియు 'బి' లు మాత్రమే సత్యం
3. 'బి' మరియు 'సి' మాత్రమే సత్యం
4. ఎ,బి మరియు సిలు సత్యం

**105.(9,4), (7,3), (6,1) మరియు(P,2) లు సమాంతర చతుర్భుజ శీర్షాలు. అయితే P విలువ**

1. 3 2. 5
3. 8 4. 9

**106.ఒక స్తంభం అడుగు భాగం నుండి 9 మీ. దూరంలో గల ఒక బిందువు నుండి ఒక బాలుడు స్తంభం పైకొన 30 డిగ్రీల ఊర్ధ్వకోణం చేస్తున్నట్లుగా గమనించాడు. ఆ స్తంభం ఎత్తు (మీటర్లలో)**

1. 4.5 2. 3రూట్3
3. 9రూట్3 4. 9/2 రూట్3

**107.ఒక వర్తకుడు రూ. 5000 పై వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) 6%కు బదులుగా 12% విధించెను. అతను అదనంగా చెల్లించిన మొత్తం**

1. రూ.300 2. రూ. 350
3. రూ.400 4. రూ.600

**108.** $\log_{0.001}0.0001$ =

1. 0.1 2. 1
3. 10 4. 4/3

**109.ఒక వృత్తాకార తోట చుట్టూ వృత్తాకార (కంకణాకార) బాట ఉన్నది. ఆ బాట యొక్క బయటి వృత్త వ్యాసార్థం 10మీ. మరియు లోపలి వృత్త వ్యాసార్థం 9మీ. అయిన ఆ బాట వైశాల్యం చ.మీ.లలో**

1. 59 5/7 2. 41.8
3. 60 4. 41 6/7

**110.ఒక కోణం దాని పరావర్తన కోణంలో 5/19 వ భాగం అయిన దాని పూరక కోణం**

1. 15డిగ్రీలు 2. 30డిగ్రీలు
3. 45డిగ్రీలు 4. 60 డిగ్రీలు

**111.ప్రవచనం -1: 22457 సంఖ్యకు 5 కలుపగా అది 11చే నిశ్శేషంగా భాగించబడును.**

**ప్రవచనం-2 : ఒక సంఖ్య 11చే భాగించవలెనన్న అందలి అంకెల మొత్తం 11 చే భాగించబడాలి.**

1. ప్రవచనం-1 సత్యం, ప్రవచనం 2 సత్యం
2. ప్రవచనం-1 అసత్యం, ప్రవచనం-2 అసత్యం.
3. ప్రవచనం-1 సత్యం, ప్రవచనం-2 అసత్యం.
4. ప్రవచనం-1 అసత్యం, ప్రవచనం-2 సత్యం

**112.** $2\tan 60^0/(1+\tan^2 30^0)$ **విలువ**

1. $\sin 60^0$ 2. $\cos 60^0$
3. $3\sin 60^0$ 4. $3\cos 60^0$

**113.ఒక తరగతి గది విద్యార్థి నాయకుడిని ఎన్నుకొనే క్రమంలో ఈ క్రింది కేంద్రీయ స్థాన కొలత స్వీకరించబడుతుంది.**

1. మధ్యగతము 2. బాహుళకం
3. సగటు 4. వ్యాప్తి

**114.ఒక కారు 40 కి.మీ./గంట వేగంతో ప్రయాణించిన గమ్యాన్ని చేరటానికి 2 గంటల 30 నిమిషాలు సమయం పడుతుంది. ఇదే దూరాన్ని 60కి.మీ. /గంట వేగంతో ప్రయాణిస్తే పట్టు కాలం?**

1. 1 గంట 20 ని॥లు
2. 1 గంట 30 ని॥లు
3. 1 గంట 40 ని॥లు
4. 1 గంట 50 ని॥లు

**115. సరియైన వాక్యాన్ని గుర్తించండి.**

1. అభివాహినాడి మెదడు నుండి సమాచారాన్ని శరీర భాగాలకు చేరవేస్తుంది.
2. సహసంబంధ నాడిని చాలకనాడి అంటారు.
3. ప్రతీకార చర్యలను మెదడు నియంత్రిస్తుంది.
4. అపవాహినాడి మెదడు నుండి సమాచారాన్ని శరీరభాగాలకు చేరవేస్తుంది.

**116. విద్యార్థుల స్వభావం, వారి విభజనలను తెలుసుకోవటానికి ఉపయోగపడనిది**

1. మధ్యగతం 2. వ్యాప్తి
3. ప్రామాణిక విచలనం
4. మాధ్యమిక విచలనం

**117. 'సర్ ఐజాక్ న్యూటన్' రచించని గ్రంథం**

1. న్యూథియరీ అబౌట్ లైట్ & కలర్స్
2. యూనివర్సల్ అర్థమాటిక్
3. ది మ్యాథమెటికల్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ నాచురల్ ఫిలాసఫి
4. ది యూనిట్ ఆఫ్ నాలెడ్జ్

**118. ఒక విద్యార్థి కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో దూరదర్శన్‌లో తన తరగతికి చెందిన పాఠాలు చూసాడు. అతనిలో జరిగే అభ్యసన శాతం**

1. 90% 2. 80%
3. 50% 4. 30%

**119. రాజు తరచుగా పత్రికలలోని శాస్త్రీయ అంశాలను చదువుతున్నాడు. అతను ప్రదర్శిస్తున్న జీవశాస్త్ర బోధనా విలువ**

1. బౌద్ధిక విలువ
2. ఉపయోగాత్మక విలువ
3. క్రమశిక్షణ విలువ
4. విరామ సమయ సద్వినియోగ విలువ

**120. 'దయోరమాలు' ఈ విధమైన బోధనా ఉపకరణాలు**

1. ద్విమితీయ బోధనా ఉపకరణాలు
2. త్రిమితీయ ఉపకరణాలు
3. బహుళమాధ్యమ ఉపకరణాలు
4. కృత్యాధారిత ఉపకరణాలు

**121. 'విద్యా లక్ష్యాల సాధనకు పాఠశాల ఉపయోగించే మొత్తం అనుభవాలను పాఠ్య ప్రణాళిక అంటారు' అని నిర్వచించినది**

1. మన్రో 2. అల్బర్ట్-అల్బర్ట్
3. శామ్యూల్ 4. కన్నింగ్ హామ్

**జవాబులు :**

91)4, 92)2, 93)4, 94)1, 95)3, 96)1, 97)1, 98)3, 99)3, 100)4, 101)4, 102)2, 103)3, 104)4, 105)3, 106)2, 107)1, 108)4, 109)1, 110)1, 111)3, 112)3, 113)2, 114)3, 115)4, 116)1, 117)4, 118)3, 119)4, 120)2, 121)1

## రచనలకు ఆహ్వానం

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.

# న్యూ ఇయర్ వేడుకల పై ఆంక్షలు..

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** నూతన సంవత్సర వేడుకలపై రాష్ట్ర పోలీసు శాఖ ఆంక్షలు విధించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బహిరంగ ప్రదేశాలలో వేడుకలను నిర్వహించకూడదని తెలిపారు. అర్ధరాత్రి కేక్ కటింగ్ మద్యం సేవించడం, అశ్లీల నృత్యాలు ప్రదర్శించడం డిజేలు, బైక్ రేసులవంటివి నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగించరదని, బహిరంగ ప్రదేశాలలో గుంపులు గుంపులుగా గుమ్మిగూడరాదని ఆయన తెలిపారు.

# వందశాతం ఇంటిపన్నులు వసూళ్లు చేయాలి



మాట్లాడుతున్న ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గ్రామంలో వంద శాతంఇంటిపన్ను, నీటి పన్ను వసుళ్లు చేయాలని ఈవోఆర్డీ అనంతశయన. గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. సోమవారం గోనెగండ్ల పంచాయతీ కార్యలయంను రికార్డులను పరిశీలిం చారు. సిబ్బందితో సమావేశం అయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది సచివాలయ ఉద్యోగులు ఇంటి పన్ను,నీటిపన్నులను ఈ నెల నుంచి మార్చిలోపు వందశాతం పూర్తిచేయాలన్నారు. పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇటీవల వ్యర్థంపై యుద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో కార్యక్రమంలో భాగంగా నీటి ట్యాంక్లు శుభ్రం చేయడం, పైపులైన్ లీకేజీలను మర్మత్తు చేయడం, ఇంటింటికి వెళ్లి పరసరాల పరిశుభ్రత గురించి వివరించడం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్కుమార్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులు రక్తదానంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి

**రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు**



రక్తదానం చేస్తున్న విద్యార్థినీ ,విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్:** యువత చదువుతోపాటు రక్తదానం లాంటి సామాజిక కార్యక్రమాల నిర్వహణకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరం మరియు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమమును క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయుటకు వచ్చిన విద్యార్థులందరిని అభినందిస్తూ ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తము వివిధ అత్యవసర కార్యక్రమాలకు ఉపయోగిస్తారని తెలియజేస్తూ కావున మీరు ఇచ్చే ఈ రక్తం ఎంతోమంది ప్రాణాలను నిలుపుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.ఎస్.కుమార్ శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రక్తదానం ద్వారా మనము ప్రాణదాతలు అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఆర్ ప్రసాద్ రెడ్డి అర్థశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ఎన్. సవితా దేవి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ని కలిసిన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్



**కర్నూలు క్రైం,మేజర్న్యూస్ :** కర్నూలు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కలెక్టర్ పి. సింధు సుబ్రమణ్యం సోమవారం మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మను కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తనను కలిసిన పి.సింధు సుబ్రమణ్యంను అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ మరియు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. కె.చిట్టి నరసమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి అందరూ సమిష్టిగా పనిచేసి రోగులకు మరింత సత్వరంగా సేవలు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె . వెంకటేశ్వర్లు వైస్ ప్రిన్సిపల్ లు డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుకా దేవి, అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడే పెన్షన్ల పంపిణీ



**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండలంలో ప్రతి నెలా ఒకటో తారీఖున పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగేదని 2025 జనవరి ఒకటో తారీఖున పంపిణీ చేయాల్సిన పెన్షన్లు ఒకరోజు ముందు డిసెంబర్ 31 తారీఖునే పెన్షన్లు ఆయా గ్రామాల కార్యదర్శుల ఆధ్వర్యంలో 31 తారీఖున పెన్షన్ పంపిణీ చేయాలని ఇన్చార్జ్ ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలో6235 మంది పెన్షన్ దారులు వివిధ రకాల పెన్షన్లను తీసుకుంటూ ఉన్నారు. వీటికి సంబంధించి రూ 2,64,19,000 పెన్షన్ పైకం పంపిణీ చేయాలని ఆదేశించారు. నూటికి నూరు శాతం పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు.

# వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**ఆళ్లగడ్డలో డి.ఎస్.పిఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

**న్యూ ఇయర్ రోజున న్యూసెన్స్ చేస్తే కఠిన చర్యలు... డి.ఎస్.పి**



హెల్మెట్ పై అవగాహన కల్పిస్తు మోటర్ సైకిల్ పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ పేర్కొన్నారు. రానున్న 2025 నూతన సంవత్సర వేడుకలను ప్రజలు కుటుంబసభ్యులతో తమ ఇళ్లలో జరుపుకోవాలని ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ సూచించారు. ఆళ్లగడ్డలోని డి.ఎస్.పి కార్యాలయంవద్దసోమవారం హెల్మెట్ బైక్ ర్యాలీని డీఎస్పీ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కుమార్ జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఈరోజు ఆళ్లగడ్డలో హెల్మెట్ ఆవశ్యకతపై బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. హెల్మెట్లు ధరించకపోవడం వలన ప్రతి రోజు ఎన్నో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టూ వీలర్స్ నడిపే వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్లను ధరించడం మంచిదని డీఎస్పీ రవికుమార్ తెలిపారు. అలాగే మోటార్వాహనాలచట్టం ప్రకారం వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఏర్పడితే రవాణా శాఖ అధికారులతో మాట్లాడి వారికి తప్పనిసరిగా లైసెన్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రవికుమార్ వివరించారు. అలాగే ఇన్సూరెన్స్ పత్రాలను కూడా వాహనదారులు కలిగి ఉండాలన్నారు. రానున్న నూతన సంవత్సరం సందర్భంగా ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్లోని ప్రజలకు డిఎస్పి రవికుమార్ ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 31న రాత్రి 10 గంటల తర్వాత ఎవరికి కూడా రోడ్లపై అనుమతి లేదని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. రేపు రాత్రి వాహనాల తనిఖీ అన్ని కూడళ్లలో ఏర్పాటు చేయడం జరిగిందని తాగి వాహనాలను నడిపి పట్టుపడితే వారిని కచ్చితంగా జైలుకు పంపిస్తామని డీఎస్పీ రవికుమార్ హెచ్చరించారు. న్యూ ఇయర్ రోజున ఎవరు కూడా తాగి న్యూసెన్స్ చేయరాదని ఆయన సూచించారు. తమ తమ కుటుంబ సభ్యులతో ఇళ్లలోనే ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని డీఎస్పీ రవికుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ చిరంజీవి, రూరల్ సీఐ కంబగిరి రాముడు, సిరివెళ్ల సిఐ వంశీధర్, టౌన్ ఎస్ఐలు షేక్ నగీన, జయప్ప , సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పరుగు పరీక్షలు ప్రారంభించిన కర్నూలు జిల్లా ఎస్పీ



**కర్నూలు క్రైం,మేజర్న్యూస్ :** పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపిఎస్పి 2వ బెటాలియన్లో దేహదారుఢ్య ( పి.ఎం.టి,పిఈటి ) సోమవారం పరీక్షలు మొదటి రోజుప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ పరీక్షలకు 600 మంది అభ్యర్థులను పిలిపించగా 280 మంది అభ్యర్థులు బయోమెట్రిక్కు హాజరయ్యారు. ఈసందర్భంగాజిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ రోజు నుండి ఫిజికల్ మెజర్ మెంట్, ఫిజికల్ ఎఫిషియన్స్ టెస్ట్ లు ఈ రోజు నుండి ప్రారంభమయ్యాయన్నారు. కర్నూలు జిల్లాలో 10 వేల 143 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి రోజు6వందల మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలో పాల్గొంటారని, పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు ఆదేశాలు జారీ చేసిందన్నారు. అన్ని ఏర్పాట్లను సిద్ధంగా ఉంచామన్నారు. ప్రతి రోజు అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, చాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పిలు, సిఐలు, ఆర్ఐలు,ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, డిపిఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# ఆదోనిలో ఘనంగా ఎమ్మెల్యే పార్థసారథి జన్మదిన వేడుకలు



**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి జన్మదిన వేడుకలను సోమవారం ఆదోనిలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పట్టణంలో కూటమి పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలుచేపట్టారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక మాతాశిశు ఆసుపత్రిలో బీజేపీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయడంతో పాటు మిఠాయిలను పంచి పెట్టారు. రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంచారు. అదేవిధంగా గ్రామాల్లో ఎమ్మెల్యే పార్థసారథికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కొంతమంది అభిమానులు ఆలయాలలో ఎమ్మెల్యే పేరిట పూజలను నిర్వహించారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతోఉండాలని పలువురుప్రముఖులు,అధికారులు, నాయకులు,కార్యకర్తలు ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎన్.సి.డి.సి.డి 3.0 సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారంనాడు జిల్లా ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావు తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టంగుటూరి సచివాలయం పరిశీలించడం జరిగింది. స్థానిక వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్ శివ శంకరుడుతో కలిసి ప్రతి గృహాన్ని సందర్శించి ఎన్.సి.డి.సి.డి 3.0 సర్వేను మరియు ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాంను పరిశీలించడం జరిగింది. ఆరోగ్య కార్యకర్తలు ఎం.ఎల్.ఎల్.పి మరియు ఆశా వర్కర్లు కలిసి ఇంటింటి సర్వే నిర్వహించాలని 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ పురుషులందరికీ తప్పనిసరిగా అన్ని పరీక్షలు నిర్వహించాలని 30 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి గురువారం, శనివారం 2గంటల నుండి 4గంటల వరకు జెడ్పిహెచ్ స్కూల్లో 30మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు అంగన్వాడిలో ప్రతి శనివారం ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు 0.5 సంవత్సరాల చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నాయక్, ప్రాథమిక ఆరోగ్య అధికారి శివశంకరుడు, హెల్త్ ఎడ్యూకేటర్ సరస్వతి, ఎం.టి.హెచ్.ఎ అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సూర్య

మంగళవారం | 31 డిసెంబర్ 2024

# హెల్మెంట్ వాడండీ... సురక్షితంగా ఉండండి : డీఎస్పీ

## – హెల్మెంట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించిన పోలీసులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** సుర క్షితంగా , ధీమాగా అనుకున్న గమ్యానికి చేరుకోవాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెంట్ వాడాలని డిఎస్సీ రామాంజి నాయక్ అన్నారు. సోమవారం హెల్మెంట్ వాడకంపై అవగాహన కల్పిస్తు డివిజన్ పోలీసు అధికారులు సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించగా డిఎస్పి ర్యాలీని ప్రారంభించారు. బైక్ ర్యాలీ నంద్యాల టర్నింగ్ నుంచి ప్రారంభమై గౌడ్‌సెంటర్, ఆర్టిసి బస్టాండ్, వ్యవసాయ మార్కెట్‌యార్డు , చక్రహోటల్ వరకు సాగింది. ఈ సందర్భంగా డిఎస్పి రామాంజి నాయక్ మాట్లాడుతూ ప్రాణంలేని సెల్‌ఫోన్ లాంటి వస్తువులనే ఎంతో అపురూపంగా చూసుకుంటామని, వాటికంటే విలువైన ప్రాణాలను కాపాడుకోవడానికి హెల్మెంట్ వాడాలన్నారు. బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెంట్ ధరించడం వల్ల ఎవైనా ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చన్నారు . నిర్లక్ష్యం వహించి రోడ్డు భద్రతా సూత్రాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించి మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబాలను అనాథ చేయవద్దని అన్నారు. బైక్‌పై వెళ్లే ప్రతి ఒక్కరికి హెల్మెంట్ శ్రీరామ రక్షలాంటిదని అన్నారు. హెల్మెంట్ ధరించి మీరు మీ కుటుంబంతో సంతోషంగా ఉండాలని కోరారు. హెల్మెంట్ వాడకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్ కుమార్ రెడ్డి, రాము, సుబ్రమాణ్యం, ఎస్ఐలు వెంకటనారాయణ రెడ్డి, కేశవ్, సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది బైక్‌మెకానికల్‌లు,తదితరులు పాల్గొన్నారు.


డిఎస్పి రామాంజి నాయక్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

నందు ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఈ క్రింది మండలాల్లో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

కర్నూలు జిల్లా :

● గూడూరు ● నందవరం ● చిప్పగిరి ● పత్తికొండ(రూరల్) ● ఆస్పరి(రూరల్) ● కోసిగి(రూరల్) ● మంత్రాలయం ● కౌతాళం

నంద్యాల జిల్లా:

● నంద్యాల(రూరల్) ● నంద్యాల(బొమ్మలసత్రం) ● నంద్యాల(లీగల్) ● గోస్పాడు ● నందికొట్కూరు(రూరల్) ● పగిడ్యాల ● బనగానెపల్లె(టౌన్) ● బనగానెపల్లె(రూరల్) ● ఆత్మకూరు(టౌన్) ● ఆత్మకూరు(రూరల్) ● మహానంది(రూరల్) ●సంజామల ●రుద్రవరం

ఆసక్తి గలవారు ఈ క్రింది ఫోన్ నెంబరును సంప్రదించగలరు:

బ్రాంచ్ మేనేజర్‌సెల్: 9704343933.


# అర్జీదారులకు వసతులు ఏర్పాటు చేయాలి

- వికలాంగుల కోసం ర్యాంప్‌లను త్వరితగతిన పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** అర్జీలు ఇచ్చేందుకు వచ్చే అర్జీదారులకు ఇబ్బంది లేకుండా వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డిఆర్‌ఓను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ లో అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన వసతులు, అర్జీ కౌంటర్ లు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. అర్జీదారులు కూర్చునేందుకు మరిన్ని చైర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఆర్వోను ఆదేశించారు. వికలాంగుల కొరకు ఏర్పాటు చేస్తున్న ర్యాంప్ లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి వివిధ రకాలుగా అర్జీలు వస్తుంటాయని, వాటిని సంబంధిత సబ్జెక్టు,ఆప్షన్ ల కింద సక్రమంగా నమోదు చేయాలని, ఆ మేరకు అవగాహనను



పెంచుకోవాలని కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్ లకు సూచించారు. అర్జీ దారులకు అన్న క్యాంటీన్ కో ఆర్డినేషన్ తో స్నాక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్వోను ఆదేశించారు. కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి కార్యాలయం వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డిఆర్‌ఓకి సూచించారు. అయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# దేవరగట్టులో అమావాస్య పూజలు

★ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించిన యువ నాయకుడు గిరిమల్లేశ్‌గౌడ

★ భక్తులతో దేవాలయం కిటకిట

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం అమావాస్య పర్వదిన సందర్భంగా భక్తులు ప్రత్యేకంగాపూజలు చేశారు.స్వామి అమ్మవారికి అర్చకులు ఉదయాన్నే రుద్రాభిషేక పూజలు చేశారు.అమ్మ వారికి కుంకుమ,బండారు అర్చన


మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న యువ నాయకుడు గిరిమల్లేశ్‌గౌడ


దేవరగట్టులో సందర్శించిన నాయకులు

పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.స్వామి అమ్మ వారికి టీడీపీ తాలూక ఇన్‌చార్జీ వీరభద్రగౌడ తనయుడు యువ నాయకుడు గిరిమల్లేశ్‌గౌడ ప్రత్యేకంగా పూజలు చేసి మోక్కుబడులు తీర్చుకున్నారు.అనంతరం పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి దేవరగట్టులో పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొత్తపేట తిమ్మయ్య, నెరణికి మల్లికార్జున, మల్లయ్య, రాజాశేఖర్‌గౌడ, ఎల్లార్తి హరిజన మహేశ్, కార్యకర్తలు పాల్గోన్నారు. భక్తులు మండలం నుండి కాకుండా కర్ణాటక ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో హజరైయ్యారు ,దేవాలయంలో భక్తులు సందడి నెలకొంది.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం ఏర్ఫాటు చేశారు.

# క్రిస్మస్ ట్రీ సెలబ్రేషన్స్‌కు మంత్రి ఆహ్వానం



ఫరూక్‌ను ఆహ్వానిస్తున్న చర్చి పెద్దలు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :**

నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ చర్చి నందు జరిగే క్రిస్మస్ ట్రీ సెలబ్రేషన్స్‌కు రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌ను ఎస్పీజీ చర్చి సెక్రటరీ ప్రభుదాసు, ఫాస్టర్ జోసెప్ బాబులు సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఫరూక్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ట్రెజరర్ స్టీఫెన్, 33వ వార్డు ఇన్‌చార్జి జోసెప్, 15వ వార్డు ఇన్‌చార్జి ఎబినేజర్, తదితరులు పాల్గొన్నారు.

# రాంకో సిమెంట్ పరిశ్రమ వద్ద రైతుల నిరసన

**కొలిమిగుండ్ల మేజర్‌న్యూస్ః** మండలంలోని కల్వటాల గ్రామంలో ఉన్న రాంకో సిమెంటు కంపెనీ ఎదుట మండలంలోని కల్వటాల, నందిపాడు, కోటపాడు, పేరుసోమల గ్రామాలకు చెందిన రైతులు రాంకో సిమెంట్ పరిశ్రమ ఎదుట ధర్నాకు దిగడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుండి వెలువడుతున్న విషవాయువుల వల్ల పొలాల పంటలపై దుమ్ము, ధూలి చేరడంతో పంటలు నష్టపోతున్నామని నష్టపరిహారం కల్పించాలని నాలుగు సంవత్సరాల నుండి కంపెనీ వారితో మొరపెట్టుకున్నా ఇంత వరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని ఇప్పటికైనా రాంకో యాజమాన్యం తమ గోడు పట్టించుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సి.ఐ రమేష్‌బాబు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


రాంకో పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

# ఫిర్యాదుదారులకు మధ్యాహ్న భోజన పంపిణీ

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఓంకారం కాశిరెడ్డి నాయన ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ ప్రాంగణంలో ఫిర్యాదుదారులకు మధ్యాహ్న భోజన పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలను విన్నవిస్తుంటారని ఫిర్యాదుదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న వసతిని కల్పించినట్లు చెప్పారు. 2023 మే నుండి ఆహారం పంపిణీ చేస్తున్న కార్యక్రమానికి కాశిరెడ్డి నాయన ఆశ్రమం వారు గత రెండు నెలల నుంచి సహకరిస్తున్నారన్నారు. నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు


మధ్యాహ్న భోజన వ సతిలో భాగంగా భోజనాన్ని పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

ఫిర్యాదుదారులకు అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ, కాశిరెడ్డి అనే ఆశ్రమ నిర్వాహకులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డీఈఓ జనార్ధన్‌రెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి, రెడ్‌క్రాస్ ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.